క్లుప్తంగా

నేడు జిల్లా స్థాయి సీఎం కప్ పోటీలు

దామరగిద్ద: మండల స్థాయి సీఎం కప్ పోటీల్లో ఎంపికైన క్రీడాకారులకు సోమవారం జిల్లా కేంద్రంలోని మినీ స్టేడియంలో కబడ్డీ, వాలీబాల్ పోటీలు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ శశికళ తెలిపారు. మంగళవారం ఖోఖో, అథ్లెటిక్స్‌లో ఎంపికైన వారికి పోటీలు ఉంటాయన్నారు. ఆయా పాఠశాలల పీఈటీలు జిల్లా స్థాయికి ఎంపికైన విద్యార్థులకు క్రీడల్లో పాల్గొనేందుకు తీసుకెళ్లాలని కోరారు.

రాబోవు ఎన్నికల్లో బీఆర్ఎస్‌దే అధికారం

మరికల్: ముఖ్యమంత్రి చేపట్టిన ప్రజా సంక్షేమ పథకాల వల్ల రాబోవు ఎన్నికల్లోనూ బీఆర్ఎస్ విజయం సాధించనుందని పార్టీ మండల ప్రధాన కార్యదర్శి కృష్ణారెడ్డి, గ్రామ అధ్యక్షులు శ్రీనివాస్‌రెడ్డి, నర్సిరెడ్డి అన్నారు. ఆదివారం వారు విలేకర్లతో మాట్లాడుతూ రాజేందర్‌రెడ్డి ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత జిల్లా రూపురేఖలు మార్చారని అన్నారు. బీజేపీ, కాంగ్రెస్‌లకు ఈసారి కూడా నిరాశ తప్పదన్నారు.

నేడు ఎమ్మెల్యే రాక

దామరగిద్ద: మండలంలోని కాన్‌కుర్తి లో బందెర భూమి పట్టాలు పొందిన రైతులకు మంగళవారం ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి, కలెక్టర్ కోయ శ్రీ హర్ష పాస్ పుస్తకాలు అందించనున్నారని సర్పంచ్ లక్ష్మి, తెలిపారు. బీఆర్ఎస్ మండల నాయకులు, రైతులు అధిక సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

తైక్వాండోను క్షేత్రస్థాయికి తీసుకెళ్తాం

మహబూబ్‌నగర్ క్రీడలు: జిల్లాలో తైక్వాండోను క్షేత్రస్థాయికి తీసుకెళ్తామని అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి సురేందర్‌బాబు అన్నారు. పాలిటెక్నిక్ కళాశాల మైదానంలో కోచ్ శంకర్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేసవి శిబిరాన్ని ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పలు సూచనలు, సలహాలు అందజేశారు. సీనియర్ తైక్వాండో విద్యార్థులు పాల్గొన్నారు.

రాజీవ్‌గాంధీకి ఘననివాళి

స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ కార్యాలయంలో ఆదివారం రాజీవ్ గాంధీ వర్ధంతి ఆదివారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. డీసీసీ అధ్యక్షుడు మధుసూదన్ రెడ్డి శాస్త్ర, సాంకేతిక రంగాల్లో భారతదేశాన్ని ప్రపంచంలో అగ్రగామిగా నిలపడంలో రాజీవ్ గాంధీ పాత్ర ఎంతో ఉందని అన్నారు. నాయకులు సంజీవ్ ముదిరాజ్, హర్షవర్ధన్‌రెడ్డి, సీజే బెనహర్, లక్ష్మణ్‌యాదవ్, అజ్మత్‌అలీ తదితరులు పాల్గొన్నారు.

కిక్‌బాక్సింగ్‌లో సత్తాచాటాలి

మహబూబ్‌నగర్ క్రీడలు: జిల్లా క్రీడాకారులు కిక్‌బాక్సింగ్ సత్తా చాటాలని బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు శివరాజ్ అన్నారు. మహాత్మాగాంధీ రోడ్డు స్కూల్ ఆవరణలో కింగ్ షోటోకాన్ కరాటే క్లబ్ ఆధ్వర్యంలోని శిక్షణా శిబిరంలో ఆదివారం విద్యార్థులకు శిక్షణ అందజేశారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న శివరాజ్ మాట్లాడారు. జహంగీర్‌పాష ఖాద్రీ ఆధ్వర్యంలో 25 ఏళ్లుగా శిబిరం నిర్వహిస్తుండడం అభినందనీయమన్నారు. రవినాయక్, 43వ వార్డు బీఆర్ఎస్ అధ్యక్షుడు శరత్‌బాబు, కింగ్ షోటోకాన్ కరాటే క్లబ్ చైర్మన్ లక్ష్మణ్, వైస్ చైర్మన్ చెన్న వీరయ్య, టీఎస్‌టీయూ అసోసియేట్ అధ్యక్షుడు హమీద్‌అలీ తదితరులు పాల్గొన్నారు.

'వీఓఏల శ్రమను దోచుకుంటున్నారు'

మహబూబ్‌నగర్ న్యూటౌన్: మహిళా సంఘాలకు గ్రామాల్లో సముచిత సేవలు అందిస్తున్న వీఓఏల శ్రమను ప్రభుత్వం దోచుకుంటోందని సీఐటీయూ జిల్లా ప్రధానకార్యదర్శి నల్లవెల్లి కురుమూర్తి ఆరోపించారు. తెలంగాణ ఐకేపీ వీఓఏల సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సమ్మె 35వ రోజుకు చేరిన సందర్భంగా మాట్లాడారు. వీఓఏలు చెవిలో పూలు పెట్టుకొని మోకాళ్లపై నిలబడి నిరసన తెలిపారు. సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 22న నిర్వహిస్తున్న కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమంలో వీఓఏలు పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు భీమయ్య, వెంకటయ్య, ధర్మానాయక్, ఆంజనేయులు, జయమ్మ, భార్గవి, సంధ్య పాల్గొన్నారు.

పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టును నీరుగార్చారు

స్టేషన్ మహబూబ్‌నగర్: పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టును బీఆర్ఎస్ ప్రభుత్వం నీరుగార్చిందని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు జి.మధుసూదన్‌రెడ్డి ఆరోపించారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రాజెక్టుపై ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి చేసిన అవగాహన లేని వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. కాంగ్రెస్ హయాంలోనే ప్రాజెక్టు నిర్మాణం కోసం రూ.38వేల కోట్లతో పరిపాలన అనుమతులు ఇచ్చారని, కానీ రీడిజైన్ పేరుతో బీఆర్ఎస్ ప్రభుత్వం జిల్లా ప్రజలకు తీరని అన్యాయం చేసిందని విమర్శించారు. 2015లో భూమిపూజ చేసినప్పుడు మూడేళ్లలో పూర్తిచేస్తామని సీఎం కేసీఆర్ హామీ ఇచ్చి విస్మరించారని అన్నారు.

పశుగ్రాసం.. పరేషాన్

- గడ్డి దొరక పాడి రైతుల అవస్థలు


ముక్కలు కిందకు పడుతున్న వరిగడ్డి


ముక్కలైన వరిగడ్డి

మద్దూరు: వరికోత యంత్రాలు అందుబాటులోకి వచ్చాక పశుగ్రాసం కొరత ఏర్పాడింది. మండలంలోని యాసంగిలో వరి కోతలు ప్రారంభమైనా వరిగడ్డి దొరకడం లేదు. యంత్రాల ద్వారా వరి కోతలు చేయడంతో గడ్డి ముక్కలుగా అవుతోంది. దీంతో గడ్డిని నిల్వచేసేందుకు రైతులకు వీలులేకుండా పోతోంది. కూలీల కొరతతో వరికోతలకు యంత్రాల వినియోగం కూడా పెరిగింది. బోరు మోటర్ల కింద, చెరువుల కిందద వరిని సాగు చేసిన రైతులు యంత్రాలతో వరికోతలు చేపట్టడంతో నష్టం తగ్గి పంట పూర్తిస్థాయిలో చేతికందుతుందని రైతులు భావిస్తున్నారు. కానీ పశువులకు మాత్రం గడ్డి దొరకడం లేదు. కూలీలతో వరికోతలు చేపడితే గడ్డి ఇబ్బడి ముబ్బడిగా ఉండేది. నిల్వ చేసుకునేందుకు కూడా అనుకూలంగా ఉంటుంది. నీటి వనరులు లేని ఆయకట్ట రైతులు పశుగ్రాసం కోసం అవస్థలు పడుతున్నారు.

గడ్డి దొరకడం లేదు..



యంత్రాలతో వరికోతలు చేపట్టడంతో పశువులకు గడ్డి దొరకడం కష్టంగా మారింది. గతంలో కూలీలతో వరికోతలు చేపడితే గడ్డి ముక్కలు కాదు. వరి గడ్డిని నిల్వ చేసేందుకు అవకాశం ఉండేది. యంత్రాలతో కోసిన వరిగడ్డి చిన్నచిన్న ముక్కలుగా రావడం, నలిగిపోతుండటంతో నిల్వకు పనికిరాకుండా పోతుంది. గేదెలకు పశుగ్రాసం కోసం తిప్పలు తప్పడం లేదు. – వి. వీరన్న, పాడిరైతు, కొత్తపల్లి

పరమేశ్వరుడి చెంత.. పచ్చదనం


పచ్చదనంతో కళకళలాడుతున్న చెట్లు

ఆత్మకూర్: పరమేశ్వరస్వామి చెంత పచ్చదనం వెల్లువిరియడంతో ఆహ్లాదకరమైన వాతావరణం నెలకొంది. పదేళ్ల క్రితం దాతల సహకారంతో రూ.3లక్షలు వెచ్చించి నాటిన పండ్లు, పూల మొక్కలు ఇప్పుడు వృక్షాలుగా ఎదిగి రమణీయంగా, సవాసనలు వెదజల్లుతున్నాయి. పట్టణంలోని చెర్ల పరమేశ్వరస్వామి ఆలయం పరిసరాల్లో మొక్కలను నాటాలని భావించి భక్తబృందం వెంటనే కార్యాచరణ చేపట్టారు. దాతల నుంచి నిధులు సేకరించారు. ఆంధ్రప్రదేశ్ నుంచి మొక్కలను తెచ్చి నాటి డ్రిప్ ఏర్పాటు చేసి సంరక్షించారు.

పండ్లు, పూల మొక్కలు

మామిడి, జామ, నేరేడు, దానిమ్మ, మేడిపండ్లు, సన్నజాజిమల్లెలు, బొడ్డుమల్లెలు, గులాబీ, మర్రి చెట్లు, టేకు చెట్లు, వేప, టెంకాయలు, జమ్మి, రాగి, చీమచింతచెట్టు, నల్లమద్ది, తెల్లమద్ది, మొదుగ, వెదురుబొంగులు, ఇతర మొక్కలను నాటారు. ప్రస్తుతం పూలను సేకరించి పట్టణంలో ఆలయాలకు పూజల నిమిత్తం ఇవ్వడంతోపాటు బయట విక్రయిస్తున్నారు.

ఉచిత వైద్య శిబిరం



నారాయణపేట రూరల్ : వారియర్స్ డిఫెన్స్ అకాడమీ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించిచారు. జాగృతి ఫౌండేషన్ వ్యవస్థాపకుడు రామకృష్ణ, లయన్స్‌క్లబ్ సభ్యులు ఆత్మారాం ముఖ్య అతిథులుగా హాజరై శిబిరాన్ని ప్రారంభించారు. డాక్టర్లు ఉదయ్, హర్షిని, ఫైజా, నగేష్, ల్యాబ్ అసిస్టెంట్ రఘు, జాగృతి సభ్యుడు చిన్న, లయన్స్‌క్లబ్ కోశాధికారి రవికుమార్‌గౌడ్, పీఈటీ సాయినాథ్, డైరెక్టర్ ఆంజనేయులు పాల్గొన్నారు.

ధాన్యం అమ్మడానికి తప్పనితిప్పలు


ధాన్యం ట్రాక్టర్లతో వేచిచూస్తున్న రైతులు

మరికల్: మిలర్లు టార్గెట్ పూర్తి కావడంతో రైతులు తీసుకు వస్తున్న ధాన్యం కొనుగోలు చేయడానికి కొర్రీలు పెడుతున్నారు. దీంతో మండు టెండల్లో గంటల తరబడి ట్రాక్టర్ల తో పడిగాపులు కాసి వారిని బతిమాలి ధాన్యం అమ్మాల్సిన పరిస్థితి నెలకొందని రైతులు వాపోతున్నారు. మరోపక్క తాలు, తేమ అంటూ బస్తాకు నాలుగు కిలోల వరకు తరుగు తీస్తున్నారని వాపోతున్నారు. అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఉత్సాహంగా బెల్టు గ్రేడింగ్ పరీక్షలు

మహబూబ్‌నగర్ క్రీడలు: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ మాడల్ బేసిక్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఆదివారం శ్రీ హనుమాన్ కరాటే, యోగా అసోసియేషన్ ఫౌండర్ కె.వెంకటేశ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు బెల్టు గ్రేడింగ్ పరీక్షలు నిర్వహించారు. సీపీఐ పట్టణ ఉపాధ్యక్షుడు కె.నర్సిములు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. బెల్టులు సాధించిన విద్యార్థులను ఆయన అభినందించారు. సురేష్‌కుమార్, బుచ్చన్న, ప్రతాప్, శ్రీనివాసులు, సాంబశివుడు, శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

శిథిలావస్థలో పశువైద్యశాల

అమరచింత: మండలంలోని మస్తీపురంలో పశువైద్యశాల భవనం శిథిలావస్థకు చేరింది. మండల ప్రధాన పశు వైద్యశాలకు అనుసంధానంగా ఉన్న సబ్ సెంటర్ కొన్నేళ్లుగా మరుగునపడింది. ఆస్పత్రి ఆలనా పాలనా చూసుకోవడానికి కాంపౌండర్ సైతం నియమించకపోవడం డిప్యూటేషన్‌పై పశుసిబ్బంది ఇతర ప్రాంతాలకు బదిలీపై వెళ్లడంతో ఇక్కడి సబ్‌సెంటర్ నిరుపయోగంగా మారింది. అధికారులు స్పందించి ఆస్పత్రికి మరమ్మతు చేసి, పశు వైద్య సిబ్బందిని నియమించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

పాత వస్తువులను అప్పగించండి

ఆత్మకూర్: మున్సిపాలిటీ పరిధిలోని ప్రజలు తమ వద్దనున్న పాతవస్తువులు, పాత దుస్తులు, పాదరక్షలు, బుక్కులు, న్యూస్‌పేపర్లు అప్పగించాలని మున్సిపల్ వైస్‌చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి, కమిషనర్ నాగరాజు, కౌన్సిలర్లు పిలుపునిచ్చారు. ఆదివారం ప్రభుత్వం ఆదేశాలమేరకు ఆర్ఆర్ఆర్ కార్యక్రమంలో భాగంగా 10 వార్డుల్లో శిబిరాలను ఏర్పాటు చేసి పాత వస్తువులను సేకరించారు. పాత సామాన్లు అప్పగించిన వారికి ప్రశంసాపత్రాలను అందజేస్తామని పట్టణ అభివృద్ధికి, పరిశుభ్రతకు సహకరించాలని కోరారు.

సమ్మేళనంలో జిల్లా కవులు

స్టేషన్ మహబూబ్‌నగర్: ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూల్‌లో ఆదివారం అంతర్జాతీయ సాహిత్య, సాంస్కృతిక సేవా సంస్థ శ్రీశ్రీ కళావేదిక ఆధ్వర్యంలో జాతీయ శతాధిక కవి సమ్మేళనం నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లాకు చెందిన కవులు నందిగామ కిషోర్, ఎంఎస్.విజయ్‌కుమార్, బసవరాజప్ప పాల్గొని తమ కవితాగానం చేశారు. ఈ సందర్భంగా వారిని నిర్వాహకులు సన్మానించారు.

పొంచి ఉన్న ప్రమాదం..

- రైల్వే కట్ట కోసం తవ్వకాలు
- విద్యుత్ స్తంభాల చుట్టూ మట్టి తొలగింపు


ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ స్తంభం

మాగనూర్: మాగనూర్, కృష్ణ, మక్తల్ మండలాల పరిధిలోని కరకట్టలు నిర్మించేందుకు మండల సమీపంలో ఉన్న పొలాల్లో రైతుల ద్వారా భూములు తీసుకొని సుమారు 25 నుంచి 30 అడుగుల మేరా లోతుతో మట్టిని తవ్వారు. ఈ ప్రాంతాల్లో పెద్ద ఎత్తున గుంతలు ఏర్పడ్డాయి. అయితే ఈ ప్రాంతంలో 33 కేవీ, 11 కేవీ విద్యుత్ లైన్లు ఉన్నాయి. ఈ లైన్లు ఉన్న స్తంభాలను వదిలి దాని చుట్టూ 25 నుంచి 30 అడుగుల మేరా లోతున మట్టి తీశారు. విద్యుత్ స్తంభాలు ఎప్పుడు కూలుతాయో తెలియని నెలకొంది. ప్రాంతాల మీదుగా వ్యవసాయ పనులకు నిత్యం కూలీలు, రైతులు రాకపోకలు కొనసాగిస్తుంటారు. ఏదైనా ప్రమాదం జరిగితే మక్తల్ నియోజవర్గంలోని దాసర్‌పల్లి, మాగనూర్, కున్సి గ్రామాలకు విద్యుత్ సమస్య తెలెత్తనుంది. విద్యుత్‌శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా చూసి చూడనట్లు వ్యవహరించడం ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పనులు పూర్తై సంవత్సరం కావొస్తున్నా విద్యుత్ లైన్ల మార్పు ఎందుకు చేయడం లేదని పలువురు ప్రశ్నిస్తున్నారు. విద్యుత్ ప్రమాదాలతో పాటు ఈదురుగాలులు, అకాల వర్షాలకు విద్యుత్ లైన్లలో ఏమైనా అంతరాయం ఏర్పడితే ఈ విద్యుత్‌స్తంభాల వద్దకు సిబ్బంది వెళ్లి ఎలా మరమ్మతు చేస్తారో తెలియని సందిగ్ధం నెలకొంది. ప్రమాదాలు చోటు చేసుకోకముందే విద్యుత్ అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.


కూలడానికి సిద్ధంగా ఉన్న విద్యుత్ లైన్

ప్రమాదాల బారిన మూగజీవాలు..

రైల్వేలైన్ నిర్మాణం కోసం కొందరు రైతుల నుంచి కాంట్రాక్టర్ మట్టిని కొనుగోలు చేశాడు. అయితే ఇంత వరకు భాగానే ఉన్న అసలు సమస్య ఇక్కడే వచ్చి పడింది. మట్టిన తవ్వకాల అనంతరం పలు జాగ్రత్తలు కాంట్రాక్టర్ తీసుకోవాల్సి ఉన్నా అవేవి పట్టించుకోకుండా ఇష్టానుసరంగా మట్టిని తవ్వి గుంతలను వదిలేశాడు. దీంతో నిత్యం ఏదో ఒక ప్రాంతంలో మూగజీవాలు మృత్యువాత పడుతున్నాయి. కనీసం గుంతలో పడితే పైకి రావడానికి కూడా దారి లేదు. సంబంధిత అధికారులు స్పందించి గుంతల చుట్టూ కంచె ఏర్పాటు చేసే విధంగా చూడాలని పలువురు రైతులు కోరుతున్నారు.

అత్యవసర సమయంలో ఇబ్బందులు..



కాంట్రాక్టర్ నిర్లక్ష్యం, విద్యుత్ అధికారుల పర్యవేక్షణ లోపం కారణంగా విద్యుత్ స్తంభాలు ప్రమాదకరంగా మారాయి. ఏదైనా అత్యవసర సమయం వస్తే ఇబ్బందులు తప్పవు. సంబంధిత అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలి.
– మారెప్ప, గ్రామస్తుడు, మాగనూర్

మరో చోటుకు మారుస్తాం..



రైల్వే కట్ట నిర్మాణ పనుల కోసం మట్టి తవ్వినప్పుడు సంబంధిత కాంట్రాక్టర్ ఎలాంటి సమాచారం ఇవ్వలేదు. అయితే ప్రస్తుతం వారి మట్టి స్తంభాల చుట్టూ తవ్వడం వలన అత్యవసర సమయంలో మరమ్మతు పనులకు తీవ్ర ఇబ్బందులు ఏర్పడతాయి. స్తంభాలను మరోచోటుకు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటాం.
– దేవేంద్రనాయుడు, ఏఈ, మాగనూర్

ప్రమాణస్వీకారోత్సవానికి తరలిరండి

ధన్వాడ: రాష్ట్ర మత్స్య పారిశ్రామిక సహకార సంఘాల సమైక్య చైర్మన్‌గా ఎన్నికైన పిట్టల రవీందర్ ముదిరాజ్ సోమవారం హైదరాబాద్‌లో ప్రమాణ స్వీకారం చేయనున్నట్లు ఆ సంఘం అధ్యక్షుడు నీరటి నర్సిములు నాయుడు తెలిపారు. ఈ మేరకు మండలంలోని మత్స్యకార్మికులు, ముదిరాజ్‌లు భారీ సంఖ్యలో తరలాలని కోరారు. గ్రామీణ స్థాయిలో మత్స్యకారుల సమస్యలను ఆయనకు తెలియజేయాలని కోరారు.


నారాయణపేట రూరల్ : మత్స్య సహకార సంఘం ఆధ్వర్యంలో సోమవారం హైదరాబాద్‌లో నిర్వహించే రాష్ట్ర స్థాయి సమావేశానికి జిల్లా నుంచి పెద్ద ఎత్తున తరలివెళ్దామని ఆ సంఘం నాయకులు కాకర్ల భీమయ్య విజ్ఞప్తి చేశారు. ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ.. సంఘం రాష్ట్ర అధ్యక్షులుగా ఎన్నికై న పిట్టల రవీందర్ ప్రమాణస్వీకారంతో పాటు సంఘ అభివృద్ధికి చేపట్టాల్సిన చర్యలు, ప్రభుత్వ సహకారంపై చర్చ ఉంటుందన్నారు. జిల్లాల వారీగా సమస్యలను రాష్ట్ర శాఖ దృష్టికి తీసుకుని వెళ్లే అవకాశం ఉందన్నారు. ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు సరాఫ్‌నాగరాజు, హన్మంతు, గోవింద్ పాల్గొన్నారు.

జీఓ 69 అమలు చేయాలి


మాట్లాడుతున్న కెంచె శ్రీనివాసులు

నారాయణపేట రూరల్ : జిల్లా ప్రజలకు తాగునీరు, రైతులకు సాగునీరు అందించేందుకు జీఓ 69ని అమలు చేయాలని జల సాధన సమితి కన్వీనర్ కెంచె శ్రీనివాసులు డిమాండ్ చేశారు. ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ.. నాడు ఉమ్మడి రాష్ట్రంలో గవర్నర్ పాలనలో ఇచ్చిన జీఓను బీఆర్ఎస్ ప్రభుత్వం తొక్కి పెట్టిందని, పాలమూర్ – రంగారెడ్డి ఎత్తిపోతలను తెరమీదకు తెచ్చి జిల్లా ప్రజలను మోసం చేస్తోందన్నారు. మిగులు జలాలతో లాభం చేకూర్చకుండా వరద జలాలపై ఆధారపడితే నీరురాక రాక రైతుల ఆత్మహత్యలు, వలసలు పెరుగుతాయన్నారు. కళ్ల ముందు నుంచి కృష్ణమ్మను శ్రీశైలం నుంచి వెనక్కి తెస్తామని చెప్పడం సరికాదన్నారు. ఈ మేరకు 23న స్వామి వివేకానంద మున్సిపల్ పార్క్ వద్ద జరిగే నిరసన దీక్షకు రైతులు, మేధావులు, విద్యార్థులు తరలి రావాలని కోరారు. సమావేశంలో కొంగరిరాములు, చెన్నప్పయాదవ్, వేపూరిరవికుమార్, నవీన్, కృష్ణ పాల్గొన్నారు.

రూ.2వేల నోట్లు తీసుకోబోమని బోర్డులు


మద్యం దుకాణం వద్ద ఏర్పాటు చేసిన బోర్డు

మక్తల్: ఇటీవల రిజర్వ్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా రూ.2వేల నోట్లు మార్చుకోవాలని సూచించింది. దీంతో మండలంలోని పలు దుకాణాల రూ.2వేల నోట్లు తీసుకోమని బోర్డులు ఏర్పాటు చేశారు. ఆదివారం చాలామంది దుకాణాల వద్దకు తిరిగి వెళ్లిపోయారు. ఈ విషయమై కొన్ని చోట్ల దుకాణాదారులతో పలువురు వాగ్వాదానికి దిగారు.

బీసీ కమిషన్‌కు చట్టబద్ధత కల్పించాలి


మాట్లాడుతున్న రాజశేఖర్

మక్తల్: రాష్ట్ర బీసీ కమిషన్‌కు చట్టబద్ధత కల్పించాలని బీసీ ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్ అన్నారు. ఆదివారం పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో బీసీలు కీలక పాత్ర పోషించారని గుర్తు చేశారు. రాష్ట్రం ఏర్పడిన తర్వాత కూడా బీసీలకు అన్ని రంగాల్లో అన్యాయం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో శ్రీనివాసులు, రామకృష్ణ, తిరుమలేశ్, అశోక్‌గౌడ్, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

వీచిన ఈదురుగాలులు



నర్వ నుంచి రాంపూర్ మధ్య నేలకొరిగిన చెట్టు

నర్వ: మండలంలో ఈదురుగాలులు ఆదివారం సాయంత్రం బలంగా వీచాయి. లంకాల్ నుంచి రాంపూర్ వరకు ఉన్న రహదారిపై చెట్టు నేలకు ఒరిగింది. దీంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. వాహనాలు ఎక్కడికక్కడే నిలిచి పోయాయి. యువకులు, చుట్టుపక్కల పొలాల రైతులు సహాయక చర్యలు చేపట్టడంతో విరిగిన చెట్టును తొలగించి వాహనాలను పంపించారు.

కంకర తేలిన రోడ్డు


అధ్వానంగా పాతపల్లి బీటీ రోడ్డు

ధన్వాడ: మండల కేంద్రం నుంచి పాతపల్లి వరకు ఉన్న మూడు కిలోమీటర్ల రోడ్డు కంకర తేలడంతో ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. నిత్యం ప్రజలు వివిధ పనుల నిత్యం ఈ దారిలో మండల కేంద్రానికి వస్తుంటారు. కాగా గుంతలమయంగా మారడం, కంకర తేలడంతో పాతపల్లి గ్రామంతో పాటు కొత్తపల్లి, ఊట్కూర్ వరకు నిత్యం వెళ్లే వారు ఇబ్బందులు పడుతున్నారని ఆయా గ్రామాల ప్రజలు అంటున్నారు. సమస్యపై అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోవడంలేదని వాపోతున్నారు. ఇప్పటికైనా పరిష్కరించాలని కోరుతున్నారు.

హజ్‌యాత్ర అవకాశం అదృష్టం



అవగాహన కల్పిస్తున్న మౌలానా రశీద్ నసీం నద్వి

స్టేషన్ మహబూబ్‌నగర్: పవిత్ర హజ్‌యాత్ర చేయడానికి అవకాశం రావడం ఎంతో అదృష్టమని హైదరాబాద్‌కు చెందిన ధార్మికవేత్త మౌలానా రశీద్ నసీం నద్వి అన్నారు. జిల్లా హజ్ సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం యాత్రీకులకు నాల్గో విడత శిక్షణ శిబిరం నిర్వహించారు. సొసైటీ అధ్యక్ష, కార్యదర్శులు మహ్మద్ మహమూద్‌అలీ, మహ్మద్ మేరాజుద్దీన్, చీఫ్ ప్యాట్రన్ రవూఫ్, ఎంఎ.సత్తార్, రజాక్, ఖాజా నిజాముద్దీన్ పాల్గొన్నారు.

కాల్వల్లో పేరుకుపోయిన ముళ్లపొదలు



అమరచింత: అమరచింత ఎత్తిపోతల పథకం ద్వారా ఆయా గ్రామాల్లో ఉన్న సాగునీటి కాల్వల్లో ముళ్లపొదలు పేరుకుపోయి, సాగునీరు ముందుకు వెళ్లడానికి ఇబ్బందులు కలుగుతున్నాయి. ఎత్తిపోతల పథకంలో భాగంగా మూలమళ్ల, మస్తీపురం, సింగపేట, ఖానాపురం, అమరచింత, పాంరెడ్డిపల్లెలో ఆయకట్టుకు కాల్వల ద్వారా సాగునీరు అందుతుంది. ప్రతి ఏడాది ఆయా గ్రామాల్లో ఉపాధి హామీ పథకం ద్వారా పంట కాల్వల్లో పెరిగిన ముళ్ల పొదలు, పూడికతీత పనులు చేశారని రైతులు తెలిపారు. ప్రస్తుతం ఉపాధి హామీ పథకం ద్వారా రెండేళ్లుగా పూడికతీత పనులు చేపట్టడం లేదు. ఇప్పటికైనా లిఫ్ట్ ప్రారంభం కాకముందే ఉపాధి హామీ ద్వారా కాల్వలలో పూడిక తీత పనులను చేపట్టాలని రైతులు కోరుతున్నారు.